ప్రజాశక్తి

గురువారం 2 మార్చి 2023

5

పార్వతీపురం మన్యం



గ్యాస్ ధర పెంపుపై
నేడు సిపిఎం నిరసనలు

ప్రజాశక్తి-పార్వతీపురం


కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలకు నిరసనగా గురువారం జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాల్లో వివిధ రూపాల్లో ఆందోళనలు నిర్వహించనున్నట్లు సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డివేణు తెలిపారు. కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్ ధరను విపరీతంగా పెంచి సబ్సిడీని పూర్తిగా ఎత్తివేసిందన్నారు. సిలిండర్ ధర పెంపుతో పేదలపై భారాలు వేస్తోందన్నారు. పేదలకు కట్టెల పొయ్యిలే దిక్కులా మారుతున్నాయన్నారు. గ్యాస్ ధర పెంపునకు నిరసనగా సిపిఎం ఆధ్వర్యాన నిర్వహించే నిరసన కార్యక్రమాల్లో ప్రజలంతా పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు.



కట్టెల పొయ్యిలతో వంట చేసుకోవాలి

గ్యాస్ ధరలు పెరగడంతో కట్టెల పొయ్యితో వంటలు చేసుకోవాల్సిందే. గ్యాస్ సిలెండర్ ధర రూ.400 నుంచి నేడు రూ.1100కు పెరిగింది. ఇదంతా బిజెపి ప్రభుత్వ పుణ్యమే. గ్యాస్ పై సబ్సిడీ ఎత్తి వేయడం అన్యాయం. పెరిగిన గ్యాస్ ధరలు తగ్గించాలి.

-సిహెచ్ రాధ, బొబ్బిలి



వంట గ్యాస్ ధరకు మళ్లీ రెక్కలొచ్చాయి. ఇప్పటికే ఓవైపు పెట్రోల్, డీజిల్ ధరలు, మరోవైపు నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ప్రజల నెత్తిన కేంద్రంలోని మోడీ ప్రభుత్వం మళ్లీ భారం మోపింది. గృహ వినియోగ గ్యాస్ సిలిండర్‌పై గత ఏడాది మార్చిలో రూ.50, జులైలో రూ.50 పెంచిన బిజెపి ప్రభుత్వం తాజాగా ఒక్కో సిలిండర్‌పై మరో రూ.50 పెంచింది. అంతేకాకుండా వాణిజ్య సిలిండర్ ధరను రూ.350.50 పెంచి పరోక్షంగా ఇతర ధరల పెంపుదలకు కారణమైంది.

బండ బాదుడు

- మళ్లీ పెరిగిన గ్యాస్ సిలిండర్ల ధరలు
- వంట గ్యాస్‌పై రూ.50 పెంపు
- వాణిజ్య సిలిండర్‌పై రూ.350.50 భారం
- ప్రజలపై నెలకు రూ.65 లక్షల వడ్డింపు

ప్రజాశక్తి - విజయనగరం

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం గ్యాస్ సిలిండర్ ధరలను మళ్లీ పెంచింది. 14.5 కిలోల గ్యాస్ సిలిండర్ ధర రూ.1060 ఉండగా, తాజాగా రూ.50 పెంచడంతో రూ.1110 అయ్యింది. దీంతో పేద, మధ్యతరగతి ప్రజలపై పెనుభారం పడింది. విజయనగరం జిల్లాలో దీపం, ఉజ్వల, సిఎస్ఆర్ తదితర పథకాల ద్వారా సుమారు 6,61,570 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, వీటిలో సాధారణ గ్యాస్ కనెక్షన్లు 3,29, 862 కనెక్షన్లు ఉన్నాయి. నెలకు సగటున సుమారు 3లక్షల సిలిండర్ల వినియోగం జరుగుతోంది. పార్వతీపురం మన్యం జిల్లాలో 2,53,242 గ్యాస్ కనెక్షన్లు ఉండగా, వీటిలో నెలకు 1.30లక్షల సిలిండర్లు వినియోగం జరుగుతోంది. ఈ లెక్కన విజయనగరం జిల్లాలో నెలకు ఒక కోటీ 50లక్షల రూపాయలు, పార్వతీపురం మన్యం జిల్లాపై రూ.65.50లక్షలు భారం పడుతోంది.

విజయనగరం జిల్లాలో కమర్షియల్ (వాణిజ్య) సిలిండర్లు 25,261 ఉన్నాయి. దీని ధర 2070 ఉండగా, బిజెపి ప్రభుత్వం తాజాగా రూ.350.50పైసలు అదనంగా పెంచింది. దీంతో సిలిండర్ ధర రూ.2420.50కు చేరింది. వాణిజ్య సిలిండర్‌పై ఈ ఏడాది జనవరిలో రూ.25 పెంచగా, తాజాగా మరింత భారం వేశారు. వీటి ధర పెంపుతో తినుబండారాల ధరలు విపరీతంగా పెరగనున్నాయి.

సబ్సిడీని ఇప్పటికే ఎత్తేసిన కేంద్రం

గతంలో సబ్సిడీపై గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేసేవారు. బిజెపి అధికారంలోకి వచ్చిన తరువాత గ్యాస్ కొనుగోలు చేశాక వినియోగదారుల ఖాతాల్లో సబ్సిడీ జమ చేస్తామని చెప్పింది. తొలినాళ్లలో గృహ వినియోగదారులకు రూ.220 వరకు సబ్సిడీ చెల్లించిన కేంద్రం క్రమంగా కోత విధించి క్రమంగా తగ్గించి, ఏడాది క్రితం నుంచి పూర్తిగా ఎత్తివేసింది. మరోవైపు పెట్రోల్, డీజిల్ ధరలు, వంట నూనెల ధరలు కూడా అమాంతంగా పెరిగిపోయాయి. దీంతో, పేదలు గ్యాస్ ధరలు భరించలేని పరిస్థితి దాపురించింది.

పింఛను బతుకులపై పెనుభారం



నా భర్త పింఛనుపై ఆధారపడి బతుకుతున్నాం. ఎడతెరపి లేకుండా పెరుగుతున్న గ్యాస్ ధరలకే సగం సొమ్ము చెల్లించాల్సి వస్తుంది. ఇక మందూ మాకూ, కరెంటు బిల్లు చెల్లింపు కోసం వృద్ధాప్యంలోనూ పనుల కోసం పరుగెత్తాల్సిన పరిస్థితి వస్తుంది. నిత్యావసర ధరలు తగ్గించకుండా, మరోవైపు భారాలు మోపితే పేదల బతుకులు మారే పరిస్థితి లేదని పాలకులు గ్రహించాలి.

– రాజమండ్రి సింహాచలం, వెంకంపేట, పార్వతీపురం మండలం

అదనపు భారం



రోజురోజుకు పెరుగుతున్న నిత్యావసరల ధరలతో కుటుంబ పోషణ కష్టమైంది. ఇలాంటి తరుణంలో ప్రభుత్వం గ్యాస్ బండపై అదనంగా ధర రూ.50 పెంచి మరింత భారం వేసింది. సరైన ఉపాధి లేక రోజువారీ కూలీ పనులపై ఆధారపడుతున్న మాలాంటి నిరుపేద కుటుంబాలకు ఆర్థిక భారం తప్పదు.

– ఎస్.సరస్వతి, గృహిణి, గుమ్మలక్ష్మీపురం

మరో 47 మందికి ఆర్‌ఆర్ ప్యాకేజి

ఫలించిన ఎయిర్‌పోర్టు నిర్వాసితుల పోరాటం

త్వరలో జిఎంఆర్‌కు భూమి అప్పగింత

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



మరడపాలెంలో ఇటీవల కూల్చివేసిన నిర్వాసితుల ఇళ్లు (ఫైల్)

ఎయిర్‌పోర్టు నిర్వాసితుల పోరాటం ఫలించింది. దిగివచ్చిన అధికార యంత్రాంగం సానుకూలంగా స్పందించింది. మరో 47 కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ వర్తింపజేసేందుకు నిర్ణయించింది. ఇప్పటికే గ్రామాలు ఖాళీ అయిన నేపథ్యంలో నిర్మాణం కోసం జిఎంఆర్ సంస్థకు భూమి అప్పగించేందుకు రంగం సిద్ధమైనట్టు సమాచారం. ఎయిర్‌పోర్టు నిర్మాణం కోసం భోగాపురం మండలంలో 2,700ఎకరాలు సేకరించిన విషయం విధితమే. ఇందులో భాగంగా మరడపాలెం, బొల్లెంకులపాలెం, ముడసర్లపాలెం, రెల్లిపేట గ్రామాలను పూర్తిగా ఖాళీ చేయించారు. ఈ గ్రామాల్లోని 376కుటుంబాల వారికి మాత్రమే ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింప జేయడంతో మిగిలినవారు తమకు కూడా ప్యాకేజీ ఇవ్వాలని పట్టుబట్టిన విషయం విధితమే. ఈ కుటుంబాలను సిపిఎం నాయకులు పరామర్శించి మద్దతు తెలిపారు. నిర్వాసితులకు న్యాయం చేయాలని కూడా విజ్ఞప్తి చేశారు. ఈనేపథ్యంలో ఆయా గ్రామాలను సందర్శించిన కలెక్టర్ ఎ.సూర్యకుమారి, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ బాధితులందరికీ న్యాయం చేస్తామంటూ ప్రకటించిన విషయం విధితమే.

ఈనేపథ్యంలో కొత్తగా 28కుటుంబాలకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీని ప్రతిపాదిస్తూ నివేదిక పంపారు. మరో 19మంది లీగల్‌హయిర్‌లకు (తండ్రి లేదా తల్లి చనిపోయినయిన అర్హులకు) వర్తింజేయాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. వీరందరికీ మిగిలినవారి మాదిరిగా 5సెంట్ల స్థలం, 9.50లక్షల నగదు అందనుంది. పోరాడితే పోయేదేం లేదు... బానిస సంకెళు తప్ప అన్నట్టుగా ఇటీవల తమకు న్యాయం చేయాలంటూ ఎయిర్‌పోర్టు నిర్వాసితులు చేసిన పోరాటం వల్లే కోల్పోతున్నామనుకున్న నష్టం పూడ్చుకున్నట్టైంది. మరడపాలెంలో స్థానికతతో కూడిన చిరునామాలు లేని వలసకూలీలకు మాత్రం ఆర్‌అండ్‌ఆర్ చట్టం వర్తింపజేయలేమని అధికారులు చేతులెత్తేశారు. కానీ, కావాలంటే సెంటు లేదా సెంటున్నర స్థలాలు ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని, ప్రతి కుటుంబానికి సొంత ఇల్లు ఉండాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. ఇళ్లు ఖాళీ చేసిననాటికి 18ఏళ్లు పైబడిన వారందరికీ ప్యాకేజీ వర్తింజేయాలన్న వాదనను అధికార యంత్రాంగం ససేమిరా అంటోంది. ఆర్‌అండ్‌ఆర్ చట్టం ప్రకారం నోటిఫికేషన్ ఇచ్చిన నాటికి మాత్రమే 18ఏళ్లు నిండాలని, ఆ తరువాత నిండినవారికి వర్తించబోదని చెబుతున్నారు. మరోవైపు గ్రామాలు ఖాళీ అయిన నేపథ్యంలో ఎయిర్‌పోర్టు ప్లానింగ్, నిర్మాణ ప్రక్రియను ముందుకు నడిపేందుకు అనుగుణంగా జిఎంఆర్ సంస్థకు భూమిని అప్పగించేందుకు అవసరమైన చర్యలు ప్రారంభం కానున్నాయి.

నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం



నిర్వాసితులందరికీ న్యాయం చేస్తాం. ఈ విషయంలో నిర్లక్ష్యం, వివక్ష అనే ప్రసక్తేలేదు. ఊళ్లు కోల్పోయిన ప్రతి ఇంటికీ తహశీల్దార్‌ను వెంటబెట్టుకుని వెళ్లాను. ఈ సందర్భంగా కొంతమంది అప్పట్లో గుర్తింపునకు నోచుకోలేదు. నోటిఫికేషన్ తరువాత కొంతమంది యజమానులు చనిపోయారు. అప్పట్లో గుర్తింపునకు నోచుకోనివారికి, నోటిఫికేషన్ తరువాత చనిపోయిన యజమానుల వారసులకు ప్యాకేజీ వర్తింపజేసేందుకు అవసరమైన చర్యలు తీసుకున్నాం. మిగిలినవారికి ప్రభుత్వం తరపున సెంటు లేదా 1.50సెంట్ల స్థలాలను మంజూరు చేస్తాం.

ఎం.వి సూర్యకళ, ఆర్‌డిఒ, విజయనగరం

ఏప్రిల్ 5న చలో ఢిల్లీ

సిఐటియు జిల్లా అధ్యక్షులు డి.రమణారావు

ప్రజాశక్తి-సీతంపేట

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ ఐదో తేదీన చలో ఢిల్లీ కార్యక్రమం చేపడుతున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు తెలిపారు. బుధవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. బిజెపి అధికారం చేపట్టినప్పటి నుండి కార్పొరేట్ అధిపతులకు దాసోహమై సామాన్యులను, రైతులను, కార్మికులను తీవ్ర ఇబ్బందులు గురిచేస్తోందని విమర్శించారు. కార్మికులు, ఉద్యోగులకు ఉన్న పెన్షన్ సౌకర్యాన్ని రద్దు చేస్తుందని ఆందోళన వ్యక్తంచేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటీకరించి దేశ ఆర్థిక వ్యవస్థనే నాశనం చేయాలని చూస్తోందని ఆగ్రహం వ్యక్తంచేశారు. రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధరలు లేకుండా చేసిందన్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ విధానాలతో ఉద్యోగ భద్రతను లేకుండా పోయిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు పెంచి సామాన్యుల జీవనానికి తీవ్ర నష్టం కలిగించిందన్నారు. ఈ నేపథ్యంలో బిజెపి అవలంబిస్తున్న ఆర్థిక విధానాలకు వ్యతిరేకంగా కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సఘాల ఆధ్వర్యంలో జిల్లాలో విస్తృత ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో సిఐటియు మండల అధ్యక్షులు ఎస్.సురేష్, కార్యదర్శి ఎం.కాంతారావు, తదితరులు పాల్గొన్నారు.



సంయుక్త స్కూల్ కరస్పాండెంట్ గోవిందరావును కలిసి అభ్యర్థిస్తున్న పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

సమస్యలపై పోరాడే పిడిఎఫ్ అభ్యర్థి
కోరెడ్ల రమాప్రభను గెలిపించండి
గోదావరి జిల్లా ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న, వాటి పరిష్కారానికి పోరాడుతున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. పట్టణంలోని ఎన్టీఆర్ స్టేడియం, రింగ్ రోడ్, బెల్లం మార్కెట్ తదితర ప్రాంతాల్లో వాకర్స్‌ను కలిసి కోరెడ్ల రమాప్రభకు ఓటు వేయాలని అభ్యర్థించారు. ఎమ్మెల్సీతో పాటు పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, ప్రజా సంఘాల నాయకులు సంయుక్త స్కూల్ కరస్పాండెంట్ గోవిందరావును కలిశారు. పలు విద్యా సంస్థల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్రానికి అన్యాయం చేస్తున్న కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్రంలో అధికార వైసిపి, ప్రతిపక్ష టిడిపిలు వంత పాడుతున్నాయని తెలిపారు. విశాఖ రైల్వే జోన్ కోసం, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మిక, ప్రజా సంఘాలతో కలిసి పిడిఎఫ్ ఎమ్మెల్సీలే పోరాడుతున్నారని చెప్పారు. 250 ప్రజా సంఘాల బలపర్చుతున్న కోరెడ్ల రమాప్రభ ఉత్తరాంధ్ర ప్రజలు గొంతై ఇక్కడి సమస్యలపై గళమెత్తుతారని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు బి.ఉమామహేశ్వరరావు, గంట శ్రీరామ్, ఎ.బాలకృష్ణ, గంట సురేష్, ఎస్ రమణ, గొర్లి తరుణ్ తదితరులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ పనులు వేగవంతం

కలెక్టర్ నిశాంత్‌కుమార్

ప్రజాశక్తి-కలెక్టరేట్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్

గృహ నిర్మాణ పనులు వేగవంతం కావాలని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ అధికారులను ఆదేశించారు. మండల అధికారులతో బుధవారం కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఒక దశ నుండి మరో దశకు ప్రగతి త్వరితగతిన ఉండాలని ఆదేశించారు. నిర్మాణాలకు ప్రత్యామ్నాయ ప్రణాళికలు ఉండాలని స్పష్టం చేశారు. విధులలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇంజినీరింగ్ సహాయకులతో పక్కాగా సమీక్షించాలని ఆయన చెప్పారు. సామగ్రి అందుబాటులో ఉండాలన్నారు. గృహ నిర్మాణాలలో సంతృప్తి లభిస్తుందని పేర్కొన్నారు. బిల్లుల చెల్లింపులు ఎప్పటికప్పుడు జరుగుతున్నాయని తెలిపారు. స్వయం సహాయక సంఘాలకు గృహ రుణాలు అందిస్తున్నామని, లక్ష్యాలు పూర్తి కావాలని ఆయన ఆదేశించారు. సొంత స్థలాల్లో నిర్మాణాలపై దృష్టి సారించాలన్నారు. సొంత స్థలాల్లో అర్హత లేని వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ నమోదు చేయరాదని స్పష్టంచేశారు. సొంత స్థలాల్లో రిజిస్ట్రేషన్లకు డిమాండ్ సర్వే చేయాలని సూచించారు.

ఉపాధి హామీలో రోజుకు కనీసం లక్ష మంది వేతనదారులు పనులు చేయాలన్నారు. పాచిపెంట, గరుగుబిల్లి, పార్వతీపురం మండలాలు లక్ష్యాల సాధనలో మెరుగు పడాలని సూచించారు.

ప్రధానమంత్రి జన ఔషది కార్యక్రమంలో నమోదుకు రానున్న మూడు రోజులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలని చెప్పారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ సిబ్బంది సహకారాన్ని పొందాలన్నారు. జన ఔషది కార్యక్రమంలో నమోదుకాని వారికి ఆరోగ్యశ్రీలో వైద్య సేవలు పొందుటకు ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని ఆయన వివరించారు. రీ సర్వేలో భాగంగా సర్వే, సబ్ డివిజన్ విధిగా జరగాలని ఆదేశించారు. జెసి ఒ.ఆనంద్ మాట్లాడుతూ రీ సర్వే వేగవంతం చేయాలన్నారు.

ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ అధికారి ఎం.వి.ఆర్.కృష్ణాజి, గృహ నిర్మాణ సంస్థ పీడీ పి.రఘురాం, డిఇఒ ఎస్.డి.వి.రమణ, డిపిఒ బలివాడ సత్యనారాయణ, గిరిజన సంక్షేమ ఇంజినీరింగ్ అధికారి జె.శాంతీశ్వర రావు, జిల్లా మహిళా శిశు సంక్షేమ అధికారి కె.విజయగౌరి, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఐటిడిఎ ఎపిఒ సురేష్, డిఆర్‌డిఎ పీడీ పి.కిరణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కిమ్మిలో ఏనుగుల సంచారం

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కిమ్మి గ్రామ సమీపంలో బుధవారం ఏనుగుల గుంపు సంచరించింది. నడుకూరు గ్రామానికి సమీపంలో ఉన్న ఏనుగుల గుంపు సాయంత్రానికి కిమ్మి గ్రామ ప్రధాన రహదారిపై సంచరించడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఈ ఏనుగుల గుంపు వల్ల పొలం పనులు చేసిన రైతులు అర్ధాంతరంగా పనులు నిలిపివేసి ఇళ్లకు చేరుకున్నారు. వాహనదారులు రాకపోకలు సాగించేందుకు భయపడ్డారు. ప్రస్తుతం ఏనుగులను ట్రాకర్లు వెంబడిస్తున్నారు. అటవీశాఖ, పోలీస్ శాఖ అధికారులు ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

11 ఏళ్లు బందీ

భార్యపై న్యాయవాది కర్కశం

ప్రజాశక్తి-విజయనగరం



సాయి సుప్రియను బయటకు తీసుకొస్తున్న పోలీసులు

పవిత్రమైన న్యాయవాద వృత్తిలో ఉన్న ఓ న్యాయవాది ఆ వృత్తికే కళంకం తెచ్చాడు. తన తల్లి, సోదరుడు మాటలు విని ఏకంగా 11 సంవత్సరాల పాటు తాళి కట్టిన భార్యను ఇంట్లో బంధించి బయట ప్రపంచానికి దూరం చేశాడు. చీకటి గదిలో బక్క చిక్కిన శరీరంతో 11 ఏళ్ల పాటు కఠినాతి కఠినమైన జీవితాన్ని ఆమె అనుభవించింది. తన న్యాయవాద వత్తిని అడ్డం పెట్టుకొని బయట ప్రపంచానికి, తల్లిదండ్రులకు దూరం చేసిన ప్రబుద్ధుడు గోదావరి మధుసూదన్. ఈ ఘటనకు సంబంధించి వన్‌టౌన్ సిఐ బి. వెంకట్రావు తెలిపిన వివరాలు ప్రకారం.. శ్రీ సత్య సాయి పుట్టపర్తి జిల్లాకు చెందిన సాయి సుప్రియ ను విజయనగరంలోని కంటోన్మెంట్ బాలాజీ మార్కెట్ సమీపంలో ఉంటున్న గోదావరి మధుసూదన్ 2008లో వివాహం చేసుకున్నాడు. వీరికి ఇద్దరు సంతానం కలిగిన అనంతరం న్యాయవాది మధుసూదన్ తన తల్లి గోదావరి ఉమామహేశ్వరి తో పాటు తన తమ్ముడు మాటలు విని పట్టుకున్న భార్యను వేధించాడు. బయట ప్రపంచానికి దూరం చేస్తూ చీకటి గదిలో 11 సంవత్సరాలు పాటు బంధించాడు. బాధితురాలు కుటుంబ సభ్యులు ఎన్ని మార్లు అడిగినప్పటికీ న్యాయవాది తన వృత్తిని అడ్డం పెట్టుకొని బాధితురాలు కుటుంబ సభ్యులను బెదిరించేవాడు. దీంతో దిక్కుతోచని స్థితిలో తమ కుమార్తె ఏమైందో తెలియక వారు నరకయాతన అనుభవించారు. సహనం కోల్పోయిన బాధితురాలి తల్లిదండ్రులు ఇటీవల జిల్లా ఎస్పికి ఫిర్యాదు చేయడంతో ఒకటవ పట్టణ పోలీసులు గతనెల 28 మధుసూదన్ ఇంటికి వెళ్లి పరిశీలించారు. తమ ఇంటిని తనిఖీ చేసే అధికారం మీకు లేదని, తనిఖీ చేసేందుకు కోర్టు ఆదేశాలు ఏమైనా ఉన్నాయా అంటూ మధుసూదన్ పోలీసులను ప్రశ్నించడంతో పోలీసులు, బాధితురాలి తల్లిదండ్రులు న్యాయస్థానాన్ని ఆశ్రయించి సెర్చ్ వారెంట్ తీసుకువచ్చారు. దీంతో బుధవారం పోలీసులు న్యాయవాది మధుసూదన్ ఇంటిని తనిఖీ చేయగా సాయి ప్రియ బక్క చిక్కిన శరీరంతో చీకటి గదిలో దుర్భరమైన జీవితాన్ని అనుభవిస్తూ ఓ మూలన కనిపించింది. దీంతో పోలీసులు ఆమెను బయటకు తీసుకువచ్చి న్యాయస్థానంలో హాజరు పరిచారు. న్యాయస్థానం ఆదేశాల మేరకు నిందితులపై చర్యలు తీసుకుంటామని ఒకటవ పట్టణ సిఐ వెంకటరావు తెలిపారు.

పాఠశాలల్లో ప్రచారాలు నిషేధం

ప్రజాశక్తి-కలెక్టరేట్

పాఠశాలల ప్రాంగణాల్లో ఎన్నిక ప్రచారాలు నిషేధమని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి ఎం.కె.మీనా అన్నారు. రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి బుధవారం జిల్లా కలెక్టర్లు, ఎస్‌పిలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మీనా మాట్లాడుతూ పాఠశాలల్లో ఎన్నికల ప్రచారం, సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికల ప్రచారాల్లో పాల్గొనరాదని, కరపత్రాలు, పోస్టర్లు పంపిణీ వంటి చర్యలు చేపట్టినా ప్రచారంలో పాల్గొన్నట్లు భావిస్తామని చెప్పారు. ప్రతి పోలింగ్ కేంద్రంలో వెబ్ కాస్టింగ్, వీడియోగ్రఫీ ఉండాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలో 24 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ జరుగుతుందన్నారు. సూక్ష్మ పరిశీలకులు, సాధారణ పరిశీలకులకు గత నెల 27న, పోలింగ్ సిబ్బందికి 28న శిక్షణ నిర్వహించామని చెప్పారు. జిల్లాలో 18,520 మంది పట్టభద్ర ఓటర్లు ఉన్నారని తెలిపారు. జిల్లాలో 8 పోలింగ్ కేంద్రాలు సున్నితమైన కేంద్రాలుగా పరిగణిస్తున్నామన్నారు. అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు నాలుగు ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికలకు రూట్, మొబైల్ ఫోర్స్, స్ట్రైకింగ్ ఫోర్స్‌లను ఏర్పాటు చేశామని వివరించారు. ఎన్నికల లెక్కింపు ప్రక్రియకు జిల్లా నుండి 110 మందిని పంపిస్తున్నామని తెలిపారు. ఎన్నికలు ప్రశాంతంగా, సజావుగా నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. జిల్లాలో బూత్ స్థాయి అధికారుల ద్వారా ఓటరు స్లిప్పులను పంపిణీచేస్తామన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐటిడిఎ పిఒ సి.విష్ణుచరణ్, జిల్లా రెవిన్యూ అధికారి జె. వెంకట రావు పాల్గొన్నారు.

కురుపాం కోర్టు న్యాయమూర్తిగా రోహిణీ రావు

ప్రజాశక్తి - కురుపాం



బాధ్యతలు స్వీకరిస్తున్న న్యాయమూర్తి రోహిణీరావు

కురుపాం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేటు కోర్టుకు నూతన న్యాయమూర్తిగా మద్ది రోహిణీరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఇన్‌ఛార్జి న్యాయమూర్తిగా ఉన్న పార్వతీపురం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేటు డి.సౌజన్య నుంచి బాధ్యతలు స్వీకరించారు. కక్షిదారులకు సత్వర న్యాయం అందించేందుకు, న్యాయ సేవలు ప్రజలకు చేరువ చేసేందుకు కృషి చేస్తానని న్యాయమూర్తి రోహిణీరావు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు నల్ల శ్రీనివాసరావు, న్యాయవాదులు బరాటం చంద్రమౌళి, వి.కుమారస్వామి, ఐ.వాసుదేవరావు,కె.సూర్యనారాయణ, సోమయాజులు, ఎల్విన్‌పేట సిఐ పి.సత్యనారాయణ. ఎల్విన్‌పేట, కురుపాం ఎస్‌ఐలు షన్ముఖరావు, సి.హెచ్.ప్రసాద్, సెబ్ ఎస్‌ఐలు బి.వి.నాగభూషణరావు, ఎం.రవిప్రసాద్, కోర్టు సిబ్బంది న్యాయమూర్తిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

జెసి చైర్మన్‌గా ఆకుల ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి-సాలూరు

ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాల జెసి చైర్మన్‌గా ఆకుల ప్రవీణ్ కుమార్ బుధవారం ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మామిడిపిల్లి పంచాయతీ కార్యదర్శి గా పనిచేస్తున్న ప్రవీణ్ కుమార్ ప్రస్తుతం ఎన్‌జిఒ తాలూకా యూనిట్ అధ్యక్షులుగా కూడా కొనసాగుతున్నారు. పట్టణంలోని పింఛనుదారుల సంఘం కార్యాలయంలో నిర్వహించిన జెఎసి సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కో చైర్మన్‌గా ఎంవి గౌరీశంకర్‌రావు, వైస్ చైర్మన్లుగా లండ వరప్రసాద్ రావు, ఎ.సురేష్, ప్రధాన కార్యదర్శిగా బాలి పద్మలత, కార్యదర్శులుగా బి.ధనంజయరావు, ఎం.రాజేశ్వరరావు, జి.శ్రీరాములు నాయుడు, కోశాధికారిగా కర్రా శ్రీనివాసరావు, ప్రచార కార్యదర్శిగా ఎన్.కోటేశ్వరరావులు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ సిఎం జగన్ మోహన్ రెడ్డి గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ ఉద్యోగులకు, పింఛను దారులకు ప్రతి నెలా ఒకటో తేదీన జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. సిపిఎస్ రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని కోరారు. ఉద్యోగులందరికీ ఇహెచ్ఎస్ అమలు చేయాలన్నారు.

రాజకీయ పార్టీలు సహకరించాలి

ప్రజాశక్తి-సీతానగరం

ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని తహశీల్దార్ ఎంవి రమణ కోరారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలింగ్ కేంద్రం వద్ద ఎటువంటి ఆర్భాటం, ప్రచారం నిర్వహించకూడదని చెప్పారు. మూకుమ్మడిగా ఉండకూడదన్నారు. సమావేశంలో వైసిపి నాయకులు బి.చిట్టిరాజు, టిడిపి నాయకులు కె.తిరుపతిరావు, ఆర్.వేణునాయుడు, సిపిఎం నాయకులు రెడ్డి లక్ష్మునాయుడు, జి.వెంకటరమణ, జనసేన నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సవరభాష వాలంటీర్లను రెన్యువల్ చేయాలి

ప్రజాశక్తి-సీతంపేట

సీతంపేట ఐటిడిఎ పరిధిలో పనిచేస్తున్న సవరభాష విద్యా వాలంటీర్లను రెన్యువల్ చేయాలని ఐటిడిఎ పిఒకు ఆ సంఘం అధ్యక్షులు సవర డొంబు, ఆనందరావు, చామంతి, రాజు బుధవారం వినతి పత్రం అందించారు. ప్రాథమిక పాఠశాలల్లో సవరబాష ద్వారా విద్యను అందించి విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న తమను రెన్యువల్ చేయాలని కోరారు.



కెజిబివిలో రికార్డులను పరిశీలిస్తున్న ఎటిడబ్ల్యుఒ సురేష్‌కుమార్

వందశాతం ఉత్తీర్ణతకు కృషి

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

పది, ఇంటర్ పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణతకు సిబ్బంది కృషిచేయాలని ఎటిడబ్ల్యుఒ సురేష్ కుమార్ అన్నారు. బుధవారం స్థానిక కెజిబివిని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన పాఠశాలలో సిబ్బంది హాజరు పట్టిక, పాఠ్యాంశ ప్రణాళిక రికార్డులు, టీచింగ్ డైరీ, మార్కుల రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం స్టోర్ రూమ్‌లో సరుకులు నిల్వను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం పది, ఇంటర్ విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణతకు తీసుకోవాల్సిన చర్యలపై సిబ్బందికి పలు సూచనలిచ్చారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రత్యేక అధికారి సిహెచ్ శ్రీ రంజిని, సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి కూలీలతో సమావేశం

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

మండలంలోని వెలగవాడ గ్రామంలో చేపడుతున్న ఉపాధి హామీ పనులను ఎంపిడిఒ దొంక త్రినాథులు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలతో సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ముందస్తు కొలతలు ఇవ్వాలని, నిర్దిష్ట పనిగంటలు పనిచేయాలని, గిట్టుబాటు వేతనం పొందాలని వేతనదారులకు సూచించారు. వృద్ధాప్య పింఛన్లు తీసుకుంటున్న వారికి, అనారోగ్యం వల్ల బాధపడుతున్న వారికి పని ఇవ్వకూడదని ఉపాధి హామీ సిబ్బందికి సూచించారు.

వాలంటీర్‌కు అభినందనలు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బానాది గ్రామానికి చెందిన కలిగొట్లు దుర్గ అనారోగ్యంతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న గ్రామ వాలంటీర్ సాయికుమార్ విశాఖ కెజిహెచ్‌కు బుధవారం వెళ్లి పింఛను డబ్బు అందించాడు. దీంతో గ్రామ స్తులు వాలంటీర్‌ను అభినం దిస్తున్నారు.

ఎమ్మెల్సీ ఓటర్ స్లిప్పులు సిద్ధం

ప్రజాశక్తి - కురుపాం

ఎమ్మెల్సీ ఓటర్ స్లిప్పులు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయని తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ అన్నారు. బుధవారం తహశీల్దార్ కార్యాలయం వద్ద బిఎల్‌ఒలకు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్చి 6లోపు బిఎల్‌ఒలు వారి పరిధిలోని అర్హులైన ఓటర్లకు సిప్పులు అందజేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎలక్షన్ సీనియర్ అసిస్టెంట్ ఎస్.పద్మిని పాల్గొన్నారు.

పేదలకు ఆహారం పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

అన్నార్తుల ఆకలి బాధను తీర్చడంలోనే నిజమైన ఆనందం ఉంటుందని జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు ఈశ్వర్ కౌశిక్, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. బుధవారం ఆ దంపతుల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో జిల్లా సర్వజన ఆస్పత్రి ఆవరణలో తమ చేతుల మీదుగా రోగుల కుటుంబ సభ్యులకు,పేదలకు ఆహార పదార్థాలను అందించి, తమ ఉదారతను చాటుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అవకాశం ఉన్న ప్రతి ఒక్కరూ ప్రత్యేక దినాల్లో పేదలను ఆదుకోవడం వల్ల సంతృప్తి లభిస్తుందన్నారు. సమాజ హితం కోరి చేసే ఏ మంచిపనికైనా ఆదరణ ఉంటుందన్నారు. ఏ అవకాశం వచ్చినా పేదలను ఆదుకోవడమే ధ్యేయంగా తాము ప్రత్యేక కార్యాచరణను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో థెరిసా క్లబ్ అధ్యక్షులు కురియకోష్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

పార్కింగ్ సౌకర్యం కల్పించాలని వినతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో పార్కింగ్ స్థలాలు లేక వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే పార్కింగ్ సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు గదుల వెంకట్రావు ఆధ్వర్యంలో జిల్లా ఎస్‌పికి, ఆర్‌టిఒకు బుధవారం వినతి అందజేశారు. పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో వాహనదారులు ఎక్కడ బడితే అక్కడ టూ వీలర్, త్రీ వీలర్ బండ్లను పార్కింగ్ చేయడం వలన పోలీసులు ఫోటోలు తీసి అధిక చలానాలు వసూలు చేస్తున్నారని తెలిపారు. నగరంలో హెల్మెట్ వాడని వారికి అపరాధ రుసుం వసూలు చేస్తున్నారని తెలిపారు. కావున అన్ని కూడల్లోను పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ చోడిఆదినారాయణ, ప్రధాన కార్యదర్శి ముదిలి నాగభూషణం, మజ్జి అప్పారావు, ఎస్ఎస్ రెడ్డి పాల్గొన్నారు.

క్రీడా దుస్తులు పంపిణీ

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

హ్యాండ్‌బాల్ పోటీలలో ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన నరిసిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు విశ్రాంత ఎంఇఒ డి.రామచంద్రరెడ్డి క్రీడా దుస్తులు అందించారు. బుధవారం ఆ పాఠశాలలో ఏడుగురు విద్యార్థులకు ట్రాక్‌సూట్, షూను అందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కె.వెంకటనాయుడు, పేరెంట్స్ కమిటీ చైర్మన్ ఎంశంకరరావు, కార్యదర్శి పురుషోత్తమనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు సబ్బాన మురళీ పాల్గొన్నారు.

సచివాలయ సేవలపై అవగాహన

ప్రజాశక్తి-రేగిడి

గ్రామ సచివాలయాల సేవలపై ప్రజలకు, విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు అన్నారు. ఈ మేరకు బుధవారం మునకలవలస, పారంపేట, ఉణుకూరు, అంబాడ వెంకటాపురం తదితర గ్రామ సచివాలయాలను ఆయన పరిశీలించారు. గ్రామ సచివాలయాల సర్వీసులు ప్రజలకు అవగాహన కల్పించిన నాడే సచివాలయ వ్యవస్థపై నమ్మకం ఉంటుందన్నారు. ప్రభుత్వ విధులు, నిధులు, ఖర్చులు, జమలు వంటివి ఎం బుక్ ప్రాప్తికి ఎప్పటికప్పుడు రికార్డులలో నమోదు చేయాలన్నారు. పారిశుధ్యం మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు. వీధిలైట్లు, కాలువల పూడిక తీతలు తీయించాలన్నారు. ఈయనతోపాటు సచివాలయాల ఉద్యోగులు ఉన్నారు.

ఇంటి పన్నులు విధిగా వసూలు చేయాలి

ప్రజాశక్తి- వేపాడ

గ్రామాల్లో ఇంటి పన్నులను విధిగా వసూలు చేయాలని ఇఒపిఆర్‌డి సూర్యనారాయణ సూచించారు. మండలంలోని కేజీపూడి, బొద్దాం సచివాలయాల్లోని సిబ్బందితో బుధవారం ఆమన సమావేశమయ్యారు. ప్రతి ఒక్కరూ ప్రభుత్వానికి ఆదాయం వచ్చే పనులపై దృష్టి సారించాలన్నారు. ఈ సమావేశంలో మండల పిఆర్ ఇంజనీరింగ్ అధికారి ఎండిఎం ఆలీ, పంచాయతీ కార్యదర్శి పద్మ పాల్గొన్నారు.

7న ద్విచక్ర వాహనాల వేలం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

పార్వతీపురం పట్టణ పోలీసుస్టేషన్‌లో నాటు సారా రవాణా చేస్తూ పట్టుబడిన 9 ద్విచక్ర వాహనాలకు ఈ నెల 7న వేలం నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ ఫకృద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వేలం వేస్తున్నామని, ఆసక్తి ఉన్న వారు పాల్గొనవచ్చని చెప్పారు.

రామాలయ ప్రతిష్ట

ప్రజాశక్తి-వీరఘట్టం

మండలంలోని కడకెల్ల గ్రామంలో బుధవారం రామాలయ పునప్రతిష్ట కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 200 మంది దంపతులతో ఎస్‌విఎల్‌ఎన్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

రమాప్రభకు మద్దతివ్వండి

విస్తృతంగా ప్రజాసంఘాల ప్రచారం

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పిడిఎఫ్ అభ్యర్థిగా కోరెడ్ల రమాప్రభకు మద్దతివ్వాలని, మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ప్రజా సంఘాల నాయకులు విస్తృతంగా ప్రచారం చేపట్టారు. బుధవారం పార్వతీపురం పట్టణంలోని చర్చివీధిలో సిఐటియు నాయకులు జి.వెంకట రమణ, బివి రమణ. పి.సన్యాసిరావు, బి.సూరిబాబు.. పట్టభద్రుల ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, నిరుద్యోగ, విద్యార్థులు హక్కుల రక్షణ కోసం పిడిఎఫ్ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. ఉత్తరాంధ్ర అభివృద్ధి, విభజన హామీల సాధన కోసం పోరాడే వారికి మద్దతివ్వాలని విజ్ఞప్తిచేశారు.

సాలూరు :ఉద్యోగ, ఉపాధ్యాయ, ప్రజాసంఘాలు బలపరిచిన పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు జిల్లా కమిటీ నాయకులు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎన్‌వై నాయుడు, మండల కార్యదర్శి ఎ.నారాయణమ్మ మండలంలోని సచివాలయాలు, పాఠశాలలు, బ్యాంకు ఉద్యోగులను కలిసి కోరెడ్ల రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ప్రజల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నించే అభ్యర్థిని గెలిపించాలని కోరారు.

సీతంపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల పిడిఎఫ్ ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభను గెలిపించాలని సిఐటియు పూర్వ నాయకులు ఆరిక భాస్కరరావు కోరారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో విద్యా వాలంటీర్లు, ప్రజాసంఘాల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం రమాప్రభ శాసనమండలిలో గొంతు వినిపిస్తారని, అందుకే మనందరం మద్దతు పలకాలని కోరారు. రమాప్రభకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి ఎమ్మెల్సీగా గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డుంబు సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.



పార్వతీపురంటౌన్.. రమాప్రభకు మద్దతుగా ప్రచారం చేస్తున్న సిఐటియు, ప్రజా సంఘాల నాయకులు

నేడు ఎమ్మెల్సీ ఎన్నికలపై సమావేశం

ప్రజాశక్తి-పాచిపెంట



తహశీల్దార్ రాజశేఖర్

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద రాజకీయ నాయకులతో గురువారం సమావేశం నిర్వహిస్తామని తహశీల్దార్ ఎం.రాజశేఖర్ తెలిపారు. ఈ నెల 13న జరిగే ఎమ్మెల్సీ ఎన్నికలకు గాను నియమ నిబంధనలు తెలియజేస్తామని, తప్పనిసరిగా అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరవ్వాలని కోరారు. పాచిపెంట మండలంలో 386 మంది ఓటర్లు ఉన్నారని, వీరికి బిఎల్‌ఒల ద్వారా ఓటర్ స్లిప్పులు అందిస్తామని తెలిపారు. పాచిపెంట జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో పోలింగ్ జరుగుతుందని తెలిపారు.

6న నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-వీరఘట్టం

ఈ నెల 6న వీరఘట్టంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మెగా నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు సత్యసాయి ఆలయ నిర్వాహకులు బుధవారం ప్రకటనలో తెలిపారు.

ఆరోగ్య కేంద్రాల సందర్శన



విద్యార్థులతో మాట్లాడుతున్న జగన్మోహనరావు

ప్రజాశక్తి-పాలకొండ

మండలంలో అన్నవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి.జగన్మోహనరావు సందర్శించారు. ఈ మేరకు ఆయన పలు ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, ప్రగతి నివేదికలను పరిశీలించారు. ప్రతి బుధ, శనివారాల్లో నిర్వహించే సార్వత్రిక టీకా కార్యక్రమంలో నిర్దేశించిన సూచనలు తప్పకుండా పాటించాలని చెప్పారు. గర్భిణులకు అవసరమైన అన్ని పరీక్షలు పూర్తి స్థాయిలో నిర్వహించి ఎప్పటికప్పుడు ఆరోగ్య పర్యవేక్షణ చేయాలని చెప్పారు. ఈ వివరాలను నమోదు చేయాలన్నారు. చిన్నారుల్లో శ్వాస సంబంధిత వ్యాధులు గుర్తిస్తే వెంటనే చికిత్స అందించి తీవ్రతను బట్టి ఆసుపత్రికి, అత్యవసర సేవల విభాగానికి రిఫర్ చేయాలని ఆదేశించారు. ఈ అంశాలపై దృష్టిసారించడం ద్వారా మాతా శిశు మరణాలను నివారించవచ్చని సూచించారు.

అనంతరం పట్టణంలో ఉన్న ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించి, విద్యార్థుల ఆరోగ్య పర్యవేక్షణ చేశారు. విద్యార్థులకు నిర్వహించిన హిమోగ్లోబిన్ పరీక్షల వివరాలను పరిశీలించారు. రక్త హీనత, పోషకాహారం, సీజనల్ వ్యాధులు, రోగ నిరోధక శక్తి పలు అంశాలపై డిఐఒ జగన్మోహనరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ వి. కమల్‌నాథ్, డాక్టర్ బి. సౌజన్య, సూపర్ వైజర్లు, ఆఫీసు సూపర్‌వైజర్ జయగౌడ్ , వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపిపి శోభారాణి

చర్చ లేకుండానే ముగించేశారు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్

పార్వతీపురం మండల పరిషత్తు సాధారణ సమావేశం ప్రారంభమైన కొద్దిసేపటికే ఏ అంశంపైనా చర్చ లేకుండానే ముగించేశారు. బుధవారం ఎంపిడిఒ సమావేశ భవనంలో ఎంపిపి మజ్జి శోభారాణి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. సమావేశానికి కోరానికి సరిపడే ఎంపిటిసి సభ్యులు ఉన్నప్పటికీ ఎన్నికల కోడ్ అమల్లో ఉన్న దృష్ట్యా చర్చలు ఏమీ చేయకూడదని ఎంపిడిఒ అకిబ్ జావేద్ సూచన మేరకు సమావేశాన్ని ముగిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం ఎంపిడిఒ మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి తప్పనిసరిగా సమావేశాలు నిర్వహించాలన్న నిబంధన అనుసరించి సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఎన్నికల కోడ్ అనుసరించి, కలెక్టర్ సూచనల మేరకు సమావేశాన్ని ముగించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సిద్ధా జగన్నాథరావు, ఎంపిటిసిలు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సరైన భోజనం అందించాలి

గురుకులాల సమన్వయకర్త చంద్రావతి



రికార్డులను తనిఖీ చేస్తు్న గురుకులాల సమన్వయకర్త చంద్రావతి

ప్రజాశక్తి-కొమరాడ

విద్యార్థులకు సరైన భోజనం అందించాలని గురుకులాల ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త బి.చంద్రావతి అన్నారు. మండల కేంద్రంలో ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ బాలికల గురుకులాన్ని బుధవారం ఆమె ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. పాఠశాల పరిసరాలు, తరగతి గదులు, భోజనశాల, విద్యార్థుల భోజనం అన్నింటినీ పరిశీలించారు. ఉపాధ్యాయుల రికార్డులను, పరీక్షా పత్రాలను పరిశీలించి సంతృప్తిని ఆమె వ్యక్తం చేశారు. పాఠశాల ఆవరణలో ఉన్న కిచెన్ గార్డెన్‌ను సందర్శించారు. కూరగాయలు, పండ్ల మొక్కలను చూసి ఆనందం వ్యక్తంచేశారు. పదోతరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులు పబ్లిక్ పరీక్షలకు ఎలా సిద్ధమవ్వాలి? పరీక్షలను ఎలా రాయాలి? తదితర అంశాలపై సూచనలిచ్చారు. నేషనల్ లెవల్ ఒలింపియాడ్ పరీక్షలో బంగారు పతకాలు సాధించిన విద్యార్థులను డిసిఒ చంద్రావతి సత్కరించారు. ఐదో తరగతి, ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం ప్రవేశాల గురించి విద్యార్థులకు వివరించారు. ఏప్రిల్ 23 వరకు దరఖాస్తులను పెట్టుకోవాలని సూచించారు. పాఠశాలలో జరిగిన ఫేర్‌వెల్ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యకమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో గురుకులం ప్రిన్సిపల్ రజనికుమారి, తదితరులు పాల్గొన్నారు.

ఇక్కడ వృథా... అక్కడ వృధ

ప్రజాశక్తి-వీరఘట్టం



నడుకూరులో వృథాగా పోతున్న తాగునీరు

మండలంలోని నడుకూరు గ్రామ రక్షిత మంచినీటి పథకం ద్వారా విడిచిపెడుతున్న తాగునీరు వృథాగా పోతుంది. కుళాయి పాయింట్లకు ఏర్పాటుచేసిన ట్యాపులు లేకపోవడంతో తాగునీరు విడిచిపెట్టినప్పుడల్లా వృథాగా పోతుంది. ఈ కారణంగా రహదారంతా నీటితో దర్శనమిస్తుంది. కొంచ గ్రామంలో ఏర్పాటుచేసిన పైప్‌లైనుకు తాగునీరు సరఫరా కాకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పథకం ప్రారంభమై ముచ్చటగా మూడు రోజులే తాగునీరు సరఫరా అయింది. అప్పటినుండి తాగునీరు రాక గుక్కెడు నీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు.

ప్రమాదకరంగా రహదారి మలుపు

ప్రజాశక్తి - మక్కువ

మండలంలోని మక్కువ -చిన భోగిలి రహదారిలోని వెంకటభైరపురం పంచాయతీ సమీపంలో బస్సు షెల్టర్ వద్ద రహదారి మలుపు ప్రమాదకరంగా తయారైంది. నిత్యం రద్దీగా ఉండే రహదారిలో ఈ ప్రాంతం వద్ద ఎదురెదురుగా వాహనాలు వస్తే గుండెలు అరచేతిలో పెట్టుకుని నడపాల్సి వస్తుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇక్కడ రహదారికి ఇరువైపులా ఇటుక బట్టీలు నిర్వహిస్తున్నారు. రహదారిని ఇరువైపులా సుమారు 8 అడుగుల లోతు వరకు తవ్వి చదును చేసుకోవడంతో రహదారి ఇరుకుగా తయారైంది. దీంతో ఏమాత్రం అజాగ్రత్తగా వాహనం నడిపినా పెను ప్రమాదం సంభవించే ఆస్కారం లేకపోలేదని వాహనచోదకులు, ప్రజలు ఆందోళన చెందుతున్నారు. అలాగే రహదారికి ఇరువైపులా ధాన్యపు పొట్టు, ఇటుక బట్టీల్లో ఉపయోగించే నల్ల బూడిద బట్టి నిర్వాహకులు జారవిడచడంతో వాహనదారులకు, ప్రయాణికులకు ఇబ్బందికరంగా మారుతుందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఈ మలుపు ప్రాంతంలో రహదారిని వెడల్పు చేసి వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారిని తవ్వేసి చదును చేసిన ప్రాంతం

నేరాలు ఘోరాలు

తాగొద్దన్నందుకు పీక కోసుకున్నాడు

ప్రజాశక్తి-పార్వతీపురంరూరల్



చికిత్స పొందుతున్న ఆదినారాయణ

తాగుడు వద్దని చెప్పినందుకు కుమారుడు ఎదుటే బ్లేడుతో పీక కోసుకున్నాడు ఓ వ్యక్తి. ప్రస్తుతం జిల్లా కేంద్రాస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ సంఘటన గరుగుబిల్లి మండలం రావుపల్లిలో బుధవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం..

గరుగుబిల్లి మండలం రావుపల్లి గ్రామానికి చెందిన బొంతాడ అదినారాయణ కొద్దిరోజులుగా తాగుడుకు బానిసయ్యాడు. ఇటీవల ఆయన భార్య కూడా మరణించడంతో తాగుడు ఇంకా ఎక్కువైంది. ఈ క్రమంలో బుధవారం తాగుడు కోసం కుమారుడు సింహాచలాన్ని డబ్బులు అడిగాడు. ఇప్పటికే ఆరోగ్యం పాడయిందని, తినడానికి తప్ప మద్యానికి డబ్బులు ఇవ్వడం కుదరదని కరాఖండీగా చెప్పాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆదినారాయణ జేబులో ఉంచుకున్న బ్లేడుతో కుమారుడి ఎదురుగానే గొంతుకోసుకున్నాడు, రక్తస్రావం కావడంతో స్పందించిన కుటుంబీకులు గరుగుబిల్లి పిహెచ్‌సికి తరలించారు. మెరుగైన వైద్యకోసం జిల్లా ఆస్పత్రికి రిఫర్ చేయగా, వైద్యులు చికిత్స అందిస్తున్నారు. అవుట్ పోస్టు పోలీసులు నమోదు చేశారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి



సీతంపేట.. సమావేశంలో మాట్లాడుతున్న ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ

ప్రజాశక్తి-సీతంపేట

గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య పరిష్కరించాలని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ బి.డిల్లేశ్వరరావు.. సిబ్బందికి సూచించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, బోరు మెకానిక్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఇ మాట్లాడుతూ బోర్లు మరమ్మతులు గుర్తైతే వెంటనే రిపేర్లు చేయించి తాగునీటి సమస్య పరిష్కరించాలన్నారు. గిరిజన గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి కొండపల్లి సత్యం, ఆర్‌డబ్ల్యుఎస్ జెఇ పవన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

కొమరాడ : మండలంలో వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు ఎంపిపి శెట్టి శ్యామల అన్నారు. బుధవారం ఎంపిడిఒ కార్యాలయంలో వేసవి నీటి ఎద్దడి నివారణలో భాగంగా క్రాస్ ప్రోగ్రాం వాహనాన్ని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఏటా వేసవి ప్రారంభానికి ముందు క్రాస్ ప్రోగ్రాం ద్వారా నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలోని 31 పంచాయతీల్లో మంచినీటి బోర్లు, బావులు, రక్షిత మంచినీటి పథకాల ట్యాంకులకు మరమ్మతులు చేసి ప్రజలకు సక్రమంగా నీరందించే చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఎల్‌వి అప్పారావు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నవీన్ కుమార్, వైసిపి మండల కన్వీనర్ ద్వారపురెడ్డి జనార్దన్, నాయకులు శెట్టి మధుసూదన్‌రావు, సింహాచలం నాయుడు పాల్గొన్నారు.



బోల్తా పడిన లారీ

భారీ లారీ బోల్తా

తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి-కొమరాడ

మండల కేంద్రమైన కొమరాడ సమీపంలోని గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాల మలుపు వద్ద బుధవారం తెల్లవారు జామున భారీ లారీ బోల్తా పడింది. విశాఖపట్నం నుంచి ఒడిశా వైపు వెళ్తున్న ఈ లారీ మలుపు వద్ద అదుపుతప్పి బోల్తా పడింది. లారీలో అల్యూమినియం పౌడర్ రవాణా చేస్తున్నారు. ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. గాయాలైన వారిని స్థానికులు ఆస్పత్రి తరలించారు. కొమరాడ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ట్రాఫిక్‌కు అంతరాయం లేకుండా చర్యలు చేపట్టారు.

నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-వీరఘట్టం

ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం కింద ఇళ్లు మంజూరైన నిర్మాణదారులు నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపిడిఒ ఎ.ప్రభాకరరావు సూచించారు. ఈ మేరకు బుధవారం మండలంలోని చలివేంద్రి నర్సిపురం, దశమంతపురం తదితర గ్రామాల్లో పర్యటించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గృహ నిర్మాణ శాఖ జెఇ వినోద్‌కుమార్, వర్క్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.



లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపిడిఒ ప్రభాకర్‌రావు